సాక్షి జనగామ

సోమవారం । 26 । జూన్ । 2023



ఏసీపీ, సీఐని సస్పెండ్ చేయాలి

రిటైర్డ్ ఎంపీడీఓ హత్యకు సహకరించిన ఏసీపీ, సీఐలను వెంటనే సస్పెండ్ చేయాలని మృతుడి కుమారుడు అశోక్ అన్నారు. - 8లో



చట్టాలపై అవగాహన పెంచుకోవాలి - 10లో

రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి నవీన్‌రావు తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం $29^0/25^0$

వాతావరణం

జిల్లాలో వాతావరణం చల్లగా ఉంటుంది. పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భగవద్గీతను ప్రతిఒక్కరూ నేర్చుకోవాలి




బచ్చన్నపేట: ప్రతిఒక్కరూ భగవద్గీతను నేర్చుకొని అందులోని సారాంశం ఆధారంగా సత్ప్రవర్తనతో జీవించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక భువనగిరి, జనగామ, చేర్యాల కమిటీల అధ్యక్షుడు దేవేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని నక్కవానిగూడెం, సదాశివపేట, చిన్నరామన్‌చర్ల గ్రామాల్లో సంచరించి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం, అనుబంధ గ్రంథాల ధర్మ మార్గ సూక్తులను గ్రామస్తులకు వివరించామన్నారు. ధర్మాన్ని వీడిన నాడు మానవుడు అధోగతి పాలు అవుతాడన్నారు. అందుకే గ్రామాల్లో సంచరిస్తూ ధర్మ మార్గాలను, సూక్తులను ప్రజలకు వివరిస్తూ అవరమున్న వారికి ధర్మ మార్గ సూక్తుల పుస్తకాలను కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్‌శ్రేష్ఠ, పంచాక్షరి, లక్ష్మీనారాయణ, జయమ్మ, వెంకటమ్మ, సక్కుభాయి, లత, లలిత, లావణ్య, కుమారి, సాయిరాజ్, ఉపేందర్, లింగస్వామి పలువురు పాల్గొన్నారు.

మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి




జనగామ రూరల్: సమాజంలో వెనుకబడిన మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలని మేరు సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు గూడూరు నరేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పట్టణ మేరు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. మేరు ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. పాఠశాల విద్యార్థులకు దుస్తులు కుట్టడానికి అవకాశం ఇవ్వాలని వారికి ఉచితంగా కట్టు మిషన్‌లు అందించాలన్నారు. పట్టణ అధ్యక్షుడిగా రామగిరి శ్రవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాపర్తి ప్రవీణ్, కోశాధికారి పట్టూరి ప్రసాద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హన్మకొండ, ములుగు జిల్లాల కన్వీనర్లు పెండ్యాల హరి ప్రసాద్, కర్రె రవీందర్, గూడూరు బాలాజీ, అలాలే రాపర్తి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య సర్వాంతర్యామి వీరయ్య



జనగామ రూరల్: సాహిత్య సర్వాంతర్యామి కవి జంగ వీరయ్య అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి అన్నారు. ఆదివారం దివంగత జంగ వీరయ్య సంస్మరణ సభ పానుగంటి రామూర్తి ఆధ్యక్షతన తెలంగాణ రజయితల సంఘం, కవులు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ రోడ్డులోని విజయ ఫంక్షన్ హాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా కవి వీరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నందిని సిద్ధారెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. హృదయాలపై మంచి పట్టు సాధించిన గొప్ప కవి అని నేటి కవులకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కవులు సాంబరాజు యాదగిరి, మాచర్ల భిక్షపతి, పోట్లపల్లి శ్రీనివాస్‌రావు, బిల్లా మహేందర్, శ్రీరాములు, రంగయ్య, సోమనర్సింహాచారి, ప్రభాకర్ ,సోమేశ్వరా చారి, మురళి, బాలయ్య, రమేష్, ముత్తయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా సతీష్



జనగామ: జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా పిట్టల సతీష్‌ను నియమిస్తూ రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ నవీన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి, రెండో సారి అవకాశం ఇచ్చారన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కొమ్మూరి ప్రశాంత్, రాష్ట్ర కో ఆర్డినేటర్, నియోజకవర్గ ముఖ్యులు, పార్టీ శ్రేణుల కృతజ్ఞతలు తెలిపారు.

పఠశాలల్లో పఠనోత్సవం

- నేటి నుంచి పాఠశాలల్లో రీడింగ్ క్యాంపెయిన్
- విద్యార్థులకు చదవడం నేర్పించాలి
- ప్రతి పీరియడ్‌లో చివరి 10 నిమిషాలు పఠనం చేయించాలి



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

జనగామ: ప్రతిరోజు పుస్తక పఠనం చేసే విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనలు, జ్ఞానం వికసిస్తుంది. దీంతో పాటు వ్యక్తీకరణ సామర్థ్యానికి బాటలు వేస్తుంది. తప్పులు లేకుండా రాయగలుగుతారు. అక్షరాలను క్రమం తప్పకుండా చదవ గలిగే సామర్థ్యం కలిగిన పిల్లలే దేనినైనా నేర్చుకోగలుగుతారు. పిల్లలు ధారాళంగా చదువుతూ.. మెరుగైన అభ్యసన ఫలితాలు సాధించేలా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నేటి (సోమవారం) నుంచి సర్కారు బడుల్లో 'పఠనోత్సవం' (రీడింగ్ క్యాంపెయిన్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం 2023–24 నూతన విద్యా సంవత్సరంలో సర్కారు బడుల్లో ఈ నెల 26 నుంచి, వచ్చే నెల జూలై 31 వరకు రీడింగ్ క్యాంపెయిన్‌ను నిర్వ హించనుంది. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చేపట్టబోయే షెడ్యూల్‌ను విడుదల చేశారు. తరగతిలో మొదటి ర్యాంకు సాధించే విద్యార్థులు సైతం... కొన్ని సందర్భాల్లో పుస్తక పఠనం చేయడంలో వెనకబడి పోతుంటారు. ప్రతి విద్యార్థి చదవడాన్ని ఒక అలవాటు చేసు కోవడంతో పాటు స్వతంత్ర పాఠకులుగా తయారు చేయడమే ప్రభుత్వం ఉద్దేశ్యం.

ప్రతీ పీరియడ్‌లో చివరి పది నిమిషాలు..

సర్కారు ఆదేశాలను పాఠశాల స్థాయిలో ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. తరగతుల వారీగా చేపట్టే పుస్తక పఠన కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాలి. ప్రతి పీరియడ్‌లో సబ్జెక్టుకు సంబంధించిన బోధన పూర్తయిన తర్వాత, బోధించిన అంశాన్ని చివరి 10 నిమిషాల వ్యవధిలో విద్యార్థులతో పఠనం చేయించాలి. విద్యార్థికి అర్థమయ్యేలా బ్లాక్ బోర్డుపై పదాలను రాసి ప్రదర్శించాలి. విద్యా శాఖ అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రీడింగ్ క్యాంపెయిన్ కార్యక్రమంలో రూమ్ టు రీడ్, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్, సేవ్ దా చిల్డ్రన్, యూ నీసెఫ్, బ్రిడ్జ్ ఇలా అనేక స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యులుగా పని చేస్తున్నాయి.

ప్రత్యేకం..గ్రంథాలయ పీరియడ్

జిల్లాలో 152 ప్రాథమిక పాఠశాలల్లో ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి ఒక్కో పాఠశాలకు 259 కథల పుస్తకాలతో పాటు కార్పెట్‌లు, ఉడెన్ డెస్కులను అందించారు. అలాగే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సైతం గ్రంథాలయ తరగతులను నిర్వహించేలా విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి రోజు ప్రతి తరగతికి ఒక గ్రంథాలయ పీరియడ్ నిర్వహించాలి. అంతే కాకుండా మూడు రోజుల పాటు మతృభాష, మరో మూడు రోజులు ఆంగ్ల భాషలో కథలను పఠనం చేయించాలి. 1 నుంచి 5 తరగతుల వరకు ఐదుగురు విద్యార్థులతో కమిటీ, 6 నుంచి 9 వరకు ఒక్కో తరగతికి ఒక్కో కమిటీ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కమిటీలోని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తరగతిలోని పిల్లల ఆసక్తికి అనుగుణంగా గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను ఎంపిక చేసి, చదివేల ప్రోత్సహించాలి. అలాగే విద్యార్థులు చదివే స్థాయిని బట్టి, గ్రూపులుగా విభజించి, ఒకరికొకరు సహాయం చేసుకునే విధంగా తోడ్పాటును అందించాలి. బడితో పాటు ఇంటికి వెళ్లిన తర్వాత కూడా విద్యార్థులు పుస్తక పఠనం చేసేలా గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్‌లను ఇవ్వాలి. ఇంటి వద్ద పిల్లలు ఏ విధంగా చదువుతున్నారే దానిపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి.

సోషల్ మీడియాలో ప్రచారం

పాఠశాలలోని గ్రంథాలయంలో విద్యార్థులు పఠనం చేసే సమయంలో వీడియో తీసి, స్కూల్ గ్రూపులతో పాటు తల్లిదండ్రులు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారులకు పంపించాలి. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రతి శనివారం పఠన పోటీలు నిర్వహించాలి. అలాగే ప్రతి పాఠశాలలో జూలై 10 నుంచి 15 వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించాలి.

అభ్యసన ఫలితాలు



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన రీడింగ్ క్యాంపెయిన్(పఠనోత్సవం) విద్యార్థుల జీవితాల్లో బంగారు భవిష్యత్‌ను నింపాలి. బడిబాటలో సర్కారు బడుల్లో నమోదు శాతాన్ని పెంచడంలో ఉపాధ్యాయుల శ్రమ వెలకట్టలేనిది. దీంతో పాటు కొత్తగా నేటి నుంచి అమలు కాబోతున్న రీడింగ్ క్యాంపేయిన్ సైతం అదే స్ఫూర్తితో సక్సెస్ చేసి, రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో ఉంచాలి. విద్యార్థులకు చదవడం అలవాటుగా చేయడం వలన, పిల్లలు అభ్యసన ఫలితాలు సాధించడానికి దోహదం చేస్తుంది. కాగా తొలిమెట్టు (కృత్యాధార బోధన) కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఉపయోగపడుతుంది.

- రామ్, డీఈఓ

ఇరకాటంలో ముత్తిరెడ్డి

- కొరకరాని కొయ్యలా మారిన కూతురు
- నాడు జనగామలో.. నేడు చేర్యాలలో..
- సందిగ్ధంలో యాదగిరిరెడ్డి రాజకీయ భవిష్యత్



జనగామ: జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డికి కన్న కూతురు తుల్జా భవానీరెడ్డి ప్రత్యర్థిగా మారి.. తన రాజకీయ భవితవ్యంపై తీవ్ర ప్రభావం చూపించేలా ఆరోపణలు గుప్పిస్తున్నారు. వివాదాస్పదంగా ఉన్న భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇబ్బందులపాలు చేస్తున్నాడని తండ్రి (ఎమ్మెల్యే)పై కొంతకాలంగా ఆమె ప్రత్యక్ష పోరాటం చేస్తున్నారు. గతంలో చేర్యాల, ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఆమె.. ఇటీవల జనగామలో ఓ అధికారిక కార్యక్రమంలో పాల్గొని, తిరిగి వెళ్తున్న క్రమంలో తండ్రి వద్దకు వచ్చి.. «నాన్న మరో కేసు పెడుతున్నాను» అంటూ సూటిగా మాట్లాడుతూ.. అనేక ప్రశ్నలను సంధించింది. దీంతో ఇద్దరి మధ్య మరింత వివాదం ముదిరి పాకాన పడింది.జనగామ నియోజకవర్గం సిద్దిపేట జిల్లా చేర్యాలలో జరిగిన భూమి రిజిస్ట్రేషన్ తండ్రి, కూతుళ్ల మధ్య దూరం పెంచింది. పెద్ద చెరువు మత్తడి ఏరియా సర్వే నంబర్ 1402లో 1,270 గజాల స్థలాన్ని ఎమ్మెల్యే తన కూతురి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. రెవెన్యూ అధికారులు ధ్రువీకరించిన పట్టా భూమిని కొనుగోలు చేసి, కూతురు అంగీకారం మేరకు రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు ఎమ్మెల్యే అంటున్నారు. కానీ తనకు ఇష్టం లేకున్నా.. సంతకాలను ఫోర్జరీ చేసి.. తన పేరిట రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆమె ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై గతంలో చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కూతురు తుల్జా భవానీరెడ్డి, మరో కేసు వేస్తున్నానంటూ బహిరంగంగా చెప్పడంతో.. తండ్రీ, కూతుళ్ల మధ్య నెల కొన్న వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

సాధారణ ఎన్నికల సమయంలో..

చేర్యాల భూ వివాదంపై ఎమ్మెల్యే కూతురు పట్టువిడవని విక్రమార్కుడిలా వెంబడిస్తుంది. ఇటీవల జనగామలో జరిగిన ఓ అధికారి కార్యక్రమంతో పాటు తండ్రి క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్ ఏరియాలో ప్రత్యక్షమవుతూ, ఎమ్మెల్యే కంట్లో నలుసుగా మారింది. దీంతో ఎమ్మెల్యేకు సంబంధించిన పలువురు బంధువులు రంగంలోకి దిగి... కూతురుకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా, విని పించుకోలేదని సమాచారం. అయినప్పటికీ సమస్య సద్దుమణిందని అంతా భావించే సమయంలో.. చేర్యాలకు వెళ్లి..తన పేరిట ఉన్న భూమిలో నిర్మాణాలను కూల్చి వేసి, ఆస్తిని మున్సిపల్‌కు రాసిస్తున్నట్లు ప్రకటించడం సంచలనంగా మారింది. సాధారణ ఎన్నికలు దగ్గర పడుతూ... బీఆర్ఎస్ టికెట్ల విషయంలో కేసీఆర్ కీలక ప్రకటన చేసిన సమయంలో ముత్తిరెడ్డి కూతురు వివాదం ప్రగతి భవన్‌కు చేరినట్లు సమాచారం. ఎన్నికల సమయంలో తనపై వచ్చే ఆరోణలు సహజమేనంటూ కొట్టిపారేస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి బాస్ కేసీఆర్ ఆశీర్వాదం ఉంటుందా లేదా అనే విషయం మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది. తన కూతురు అమాయకురాలు... అల్లుడు.. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కలిసి తనపై ఇటువంటి కుట్రలకు తెగబడ్డారని ఎమ్మెల్యే ఆరోపణలు చేస్తున్నారు. కూతురును అడ్డం పెట్టుకుని తన రాజకీయ జీవితంలో ఆడుకుంటున్నది ఎవరో సీఎం కేసీఆర్‌కు తెలుసని.. అయినా జనగామ టికెట్ నాదే... గెలిచేది కూడా నేనే అంటూ మీడియాకు వెల్లడించారు. చేర్యాలలోని భూమిని కూతురు మున్సిపల్‌కు రాసి ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నానని ఎమ్మెల్యే చెబుతున్నారు.

హత్య కేసులో విచారణ వేగవంతం

బచ్చన్నపేట: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్యను హత్య చేసిన కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. ఆదివారం కూడా పలు గ్రామాలకు చెందిన నాయకులను పోలీస్ స్టేషన్‌కు రప్పించి నర్మెట సీఐ నాగబాబు విచారణ చేశారు. రామకృష్ణయ్యను జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్య సుపారీ ఇచ్చి హత్య చేయించిన విషయం విధితమే. హంతకుడు అంజయ్య హత్యకు ముందు ఎవరెవరితో కలిసి ఉన్నాడో ఎవరితో ఎక్కువ ఫోన్‌లను మాట్లాడాడో అనే విషయాన్ని పోలీసులు తెలుసుకొని ఆ వ్యక్తులను పట్టుకొని వచ్చి విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విచారణలో కొత్తగా పేరు బయటకు వస్తున్న నూతన వ్యక్తులను కూడా స్టేషన్‌కు రప్పిస్తూ విచారణ చేస్తున్నట్లు తెలిసింది. అంజయ్య సుపారీ ఇచ్చి హత్య చేయడానికి కొందరు నాయకులు సుపారీ డబ్బులను ఇవ్వడానికి ముందుకు రావడంతో అంజయ్య ఆ పని చేయించినట్లు ఆ నోటా ఈనోటా తెలుస్తోంది. అంజయ్యతో హత్యకు ముందు సన్నిహితంగా మెదిలిన నాయకులకు ఏ సమయంలో పోలీసుల నుంచి ఫోన్ వస్తుందో అని పలువురు నాయకులు బిక్కు బిక్కు మంటూ రోజులు గడుపుతున్నారు. వరంగల్ సీపీ రంగనాథ్ టాస్క్‌ఫోర్స్ అధికారులను బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఉంచి వారిని సివిల్ డ్రెస్‌లో మండలంలోని చుట్టు పక్కల గ్రామాలను తిరిగి పరిస్థితులను గమనించమని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. వారు రోజు స్టేషన్‌లోనే ఉంటూ వారు పోలీస్ అధికారులు అన్నట్లు తెలియకుండా ఓపక్కకు ఉంటూ పోలీస్ స్టేషన్‌కు ప్రతి రోజు వచ్చే వారిని గమనిస్తూ ఇక్కడ జరిగే పరిస్థితులను రోజు వారీగా సమాచారాన్ని సీపీకి అందిస్తున్నట్లు తెలిసింది. ఈ హత్య కేసు రోజుకో కోణంలో మలుపు తిరుగుతుండడంతో అసలు ఏమి జరుగుతుందో అని మండల నాయకులు భయపడుతున్నారు.

హత్య చేసిన వారిపై చర్య తీసుకోవాలి

మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్యను హత్య చేసిన హంతకులకు, సహకరించిన వారికి తగిన శిక్ష పడేలా చూడాలని బీఆర్ఎస్ నాయకురాలు నంది నిర్మల అన్నారు. ఆదివారం రామకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆమె వెంట నాయకులు తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం



నిడిగొండలో మాట్లాడుతున్న కొమురయ్య

రఘునాథపల్లి: భవన నిర్మాణ రంగాల కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య డిమాండ్ చేశారు. 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 5, 6న నిర్వహించనున్న జిల్లా మహాసభ విజయవంతానికి ఆదివారం సంఘం నాయకులతో కలిసి ఆయన మండలంలోని పలు గ్రామాల్లో భవన నిర్మాణ కార్మికులతో సమావేశమయ్యారు. పలు గ్రామాలకు చెందిన భవన నిర్మాణ గ్రామ కమిటీలు మహాసభకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామల్ల ఐలన్న పిలుపు మేరకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న మహాసభ జయప్రదం కోసం భవన నిర్మాణ రంగాల కార్మికులతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కోశాధికారి తూడి అంజయ్య, కార్యదర్శి కొమ్మగళ్ల కృష్ణ, తిప్పారపు ప్రకాష్, ఎల్లయ్య, వెంకటయ్య, ఐలయ్య, పెద్ద అంజయ్య, సాయిలు, తూడి కృష్ణ, భాస్కర్, రవి, సత్యం, యాదగిరి, దర్గాస్వామి, శ్రీనివాస్, ఐలేష్, వెంకటేశ్వర్లు, స్వామి, నాగరాజు, రాజు, కుమార్, యాదగిరి పాల్గొన్నారు.

గోవధ నివారణకు చర్య తీసుకోవాలి



రైతులకు లేగదూడలు పంపిణీ చేసిన అగర్వాల్

కొడకండ్ల: బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ కోరారు. ఆదివారం మండలకేంద్రానికి చెందిన రైతులకు లేగ దూడలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బక్రీద్‌కు ముందు తర్వాత అంతరించిపోతున్న పశు సంపదను కాపాడాలని, ఆవులు, లేగదూడలకు షెడ్లు నిర్మించి పునవావాసం అందించాలని, ఎస్‌పీసీఎలో పేర్కొన్న విధంగా వైద్య సహాయం అందించాలని, అక్రమ వధకు పాల్పడుతున్న కసాయిలను గుర్తించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకొంటూ ప్రత్యేక పోలీస్ బృందాలు, టాస్క్‌ఫోర్స్‌లను ప్రభుత్వం నియమించాలని డిమాండ్ చేశారు. పశుసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గోశాల బాధ్యులు యాకూబ్, రాములు, రవి, బందు సైదులు తదితరులు పాల్గొన్నారు.



విషాద యాత్ర

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు



మరికొద్దిసేపట్లో ఇల్లు చేరతారనగా ప్రమాదం

- టిప్పర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
- భర్త, కూతురు– అల్లుడు, మనవరాలు అక్కడికక్కడే దుర్మరణం
- ప్రాణాలతో బయటపడిన కుమారుడు, చిన్నకూతురు, మనవడు
- వరంగల్ కాశిబుగ్గ వీకర్స్ సెక్షన్ కాలనీలో విషాదం
- అమ్మానాన్న ఎక్కడంటూ గాయపడ్డ హర్షిత రోదన

వరంగల్/కాశిబుగ్గ/ఆత్మకూరు/ఎంజీఎం: విహార యాత్ర విషాదయాత్రగా మిగిలింది. అమ్మవార్ల ఆశీస్సులు తీసుకుని సరదాగా నవ్వుతూ బయల్దేరిన ఆ కుటుంబం మరికొద్దిసేపట్లో ఇల్లు చేరుతుందనగా.. టిప్పర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు నలుగురిని కబళించింది. టిప్పర్ డ్రైవర్ అతివేగం.. అజాగ్రత్త కారణంగా నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వెల్దండి సాంబరాజు వరంగల్‌లోని అబ్బనికుంటవాసి. అతడి మామ నర్సింహస్వామి. వీరిద్దరూ బట్టలబజార్‌లోని ఒకే స్టీల్ దుకాణంలో పని చేస్తున్నారు. ఇటీవల ఆస్తి పంపకాలు జరగడంతో సాంబరాజుకు ఖాళీ స్థలం వచ్చింది. దీంతో వీకర్స్ సెక్షన్ కాలనీలోని అత్తామామలు ఉండే ఇంటి పక్కనే ఉన్న వీధిలో అద్దెకు ఉంటున్నారు. కారు ప్రమాదంలో సాంబరాజు దంపతులు, కూతురు మృతి చెందడంతో కుమారుడు అక్షయరాజ్ ఒక్కడే మిగిలాడు. ఈఘటనలో నర్సింహస్వామి మృతి చెందగా.. భార్య రాజశ్రీ, చిన్న కూతురు హర్షిత గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కుమారుడు ఆకాశ్‌కు గాయాలయ్యాయి. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందిన విషయం తెలియడంతో వీకర్స్ సెక్షన్ కాలనీ, అబ్బనికుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రమాదం జరిగిందిలా..

అనుముల నర్సింహస్వామి 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి కారులో మేడారం వెళ్లారు. అమ్మవార్లను దర్శించుకుని సాయంత్రం వరకు అక్కడే గడిపారు. సుమారు 4 గంటల సమయంలో మేడారం నుంచి వరంగల్‌కు బయల్దేరారు. 5.45 నిమిషాల సమయంలో వీరి కారు ఆత్మకూరు సమీపానికి చేరింది. పత్తిపాకరోడ్డులోని క్రషర్ మిల్లులోకి వెళ్తున్న టిప్పర్ ఎదురుగా వచ్చి కారును ఎడమవైపు బలంగా ఢీకొట్టింది. ఎడమ వైపున్న కారు రోడ్డుకు కుడివైపునకు తిరిగింది. బలంగా ఢీకొట్టడంతో కారు నుజ్జునుజ్జయ్యింది. డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్న వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న ముగ్గురు అందులోనే ఇరుక్కుపోయారు. టిప్పర్ మరో మూడు కిలోమీటర్లు ముందుకు వెళ్తే క్రషర్ మిల్లు వైపు వెళ్లిపోయేది.

వద్దని వారించినా..

నర్సింహస్వామి మనవడు, సాంబరాజు కుమారుడు అక్షయరాజ్ పుట్టువెంట్రుకలు తిరుపతిలో తీయాల్సి ఉంది. అందుకు ముందుగా మేడారం వనదేవతల్ని దర్శనం చేసుకునేందుకు ఇంటి ఎదుట ఉన్న వారి కారు ఇవ్వాలని పలుమార్లు అడిగారు. కారు యజమానులు వద్దని వారించినట్లు తెలిసింది. చివరకు నర్సింహస్వామి కుటుంబ సభ్యుల ఒత్తిడితో కారు ఇచ్చారు. ఆకాశ్ డ్రైవింగ్ చేసుకుంటూ 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి బయల్దేరారు. కారులో పాటలు వింటూ, ఎంజాయ్ చేస్తూ.. వెళ్తున్న వీడియోలను వాట్సాప్ స్టేటస్‌లో కూడా పోస్ట్ చేశారు. ఉదయం వారు తయారవుతున్న విషయం తెలుసుకుని వన భోజనాలకు వెళ్తున్నట్లు భావించగా.. మేడారం వెళ్లి వస్తామని తిరిగి రాని లోకాలకు వెళ్లారని కన్నీటిపర్యంతమయ్యారు.

కలిసిరాని దైవ దర్శనాలు

వెల్దండి సాంబరాజు కుటుంబానికి దైవ దర్శనాలు కలిసి రావడం లేదని పలువురు స్థానికులు వాపోతున్నారు. ఏడాదిన్నర క్రితం సాంబరాజు తల్లి మృతి చెందడంతో అస్థికలు కలిపి కాళేశ్వరంలో దర్శనం చేసుకునేందుకు వెళ్లి వస్తున్న క్రమంలో కాటారం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సాంబరాజు అక్క మృతి చెందారు. అదే కారులో ఉన్న రాజశ్రీ ప్రాణాలతో బయటపడ్డారు. ఇప్పుడు జరిగిన ఘటనలోనూ రాజశ్రీ గాయాలతో బయటపడిందని స్థానికులు తెలిపారు. మళ్లీ మేడారం దర్శనానికి వెళ్లి వస్తున్న క్రమంలో మరోసారి జరిగిన రోడ్డు ప్రమాదంలో సాంబరాజుతో పాటు భార్య ఆకాంక్ష, కూతురు లక్ష్మీప్రసన్న చనిపోవడంతో వీరి కుటుంబానికి దైవదర్శనాలు కలిసి రావడం లేదని స్థానికులు, బంధువులు వాపోతున్నారు.

ఎవరెవరు ఎక్కడ కూర్చున్నారంటే..

కారులో ఆకాశ్ డ్రైవింగ్ చేస్తుండగా.. ముందు సీట్లో సాంబరాజు, కూతురు లక్ష్మీప్రసన్న, వెనుక సీట్లో నర్సింహస్వామి, రాజశ్రీ, ఆకాంక్ష, హర్షిత, అక్షయరాజ్ కూర్చున్నట్లు తెలిసింది. ముందు సీట్లో ఇద్దరు ఉండడం వల్ల సీట్ బెల్ట్ పెట్టుకోలేదని సమాచారం. కాగా.. డ్రైవర్ సీట్లో ఉన్న ఆకాశ్ సీట్ బెల్టు పెట్టుకోవడంతో సురక్షితంగా బయటపడినట్లు తెలిసింది. కారులో 8మంది ప్రయాణం చేయడంతోనే మృతుల సంఖ్య పెరిగినట్లు తెలిసింది.

ప్రాణాపాయ స్థితిలో రాజశ్రీ

ప్రమాదంలో గాయపడిన అనుముల రాజశ్రీని ఎంజీఎంలో చేర్పించగా.. ఆమె ముఖ భాగంతో పాటు తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. రాజశ్రీ శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, అంబుబ్యాగ్ ద్వారా చికిత్స అందిస్తున్నామని, ఆమెకు వెంటిలైటర్ ద్వారా చికిత్స అందించనున్నట్లు వైద్యులు తెలిపారు. హర్షిత ప్రస్తుతం ఎంజీఎంలో చికిత్స పొందుతోంది. ప్రస్తుతం హర్షిత షాక్‌లో ఉందని వైద్యులు పేర్కొంటున్నారు.



ఘటనాస్థలిలో మృతులు, క్షతగాత్రులు





కారులో వెళుతున్న లక్ష్మీప్రసన్న, రాజశ్రీ, ఆకాంక్ష



కుమారుడు, కూతురుతో సాంబరాజు (ఫైల్)

మృతులు..

భర్త: అనుముల నర్సింహస్వామి(52)
కూతురు అల్లుడు: వెల్దండి ఆకాంక్ష(26),
వెల్దండి సాంబరాజు(40),
మనుమరాలు: లక్ష్మీప్రసన్న(9)

క్షతగాత్రులు..

తల్లి భార్య రాజశ్రీ(50),
కుమారుడు ఆకాశ్(29),
చిన్న కూతురు హర్షిత(20),
మనవడు అక్షయరాజ్(6)

అమ్మ, నాన్న ఎక్కడ..

ఒక్కసారిగా జరిగిన రోడ్డు ప్రమాదంతో హర్షిత దిగ్భ్రాంతికి గురైంది. క్షతగాత్రులను ఎంజీఎం ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్న క్రమంలో హర్షిత అమ్మ, నాన్న ఎక్కడా అంటూ.. రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. ప్రస్తుతం హర్షితకు గాయాలు మాత్రమే అయ్యాయని, ఎలాంటి ప్రాణ పాయం లేదని వైద్యులు పేర్కొంటున్నారు.

ఘటనపై మంత్రి ఎర్రబెల్లి దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వరంగల్ సీపీ రంగనాథ్‌కు ఫోన్ చేసి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఫోన్ ద్వారా ఆదేశించారు.

డేంజర్ జోన్ | రక్తసిక్తమవుతున్న ఎన్‌హెచ్–163 - వివరాలు 8లో

ఇద్దరిపై ఫిర్యాదు

జనగామ: పరువు తీసేలా తనపై ఆరోపణలు చేస్తున్నారంటూ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు ఇద్దరిపై ఫిర్యాదు చేశారని సీఐ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల బచ్చన్నపేట మండలానికి చెందిన సుభద్ర పోస్టుమార్టం రిపోర్టు విషయంలో డాక్టర్ సుగుణాకర్‌రాజుపై వచ్చిన ఆరోపణలు నేపథ్యంలో ఆయన ఫిర్యాదు చేశారు. సుభద్ర పోస్టుమార్టం చేసింది డాక్టర్ సుగుణాకర్ రాజు కాదని, డాక్టర్లు రాహుల్, ప్రదీప్ టీం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనవసరంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై విచారణ చేసి కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సీఐ తెలిపారు.

అదృశ్యం వెనుక ఆంతర్యమేమిటో..?


వినయ్‌కుమార్

గూడూరు : మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాములుతండాకు చెందిన నూనావత్ వినయ్‌కుమార్ అదృశ్యం వెనుక ఆంతర్యమేమిటో అంతుచిక్కడం లేదు. తండాకు చెందిన నూనావత్ సదాశివుడి కొడుకు వినయ్‌కుమార్ కోల్‌కతాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 21 తేదీన కోల్‌కతా నుంచి విజయవాడ వరకు రైలులో వస్తూ రాత్రి 10.26 గంటలకు అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా వినయ్‌కుమార్ సెల్‌నంబర్.. ఏపీలోని విశాఖలోని సెవెన్ హిల్స్ హాస్టల్‌లో 10 రోజులుగా పనిచేసిందని గుర్తించారు. అనంతరం పోలీసులు హాస్టల్ యజమాని, సిబ్బందితో శనివారం రాత్రి వరకు ఆరా తీశారు. వినయ్‌కుమార్ ఈ నెల 22వ తేదీన వచ్చి రూం ఖాళీ చేసిన విషయం సీసీ ఫుటేజ్ ఆధారంగా నిజమేనని గ్రహించారు. రైలు నుంచి పడిపోయాడు అనుకున్న వినయ్‌కుమార్.. తెల్లవారి విశాఖలోని 7 హిల్స్ హాస్టల్‌కు రావడం, తండ్రి సదాశివుడితో మాట్లాడిన తీరుపై ఆరా తీశారు. తెల్లవారుజామున విజయవాడకు, సాయంత్రానికి తండాకు వస్తానని చెప్పాడని తండ్రి సదాశివుడు పోలీసులుకు చెప్పడం అర్థం కాకుండా ఉంది. 5 నెలల క్రితం ప్రేమించి, ఇరువురి తల్లిదండ్రుల అనుమతితో పెళ్లి చేసుకున్న వినయ్‌కుమార్ ఎందుకు ఇలాంటి తప్పుడు సమాచారం ఇచ్చాడనే విషయం పోలీసులను గందరగోళానికి గురిచేస్తోంది. కాగా, హాస్టల్ వద్ద విచారణ చేపట్టిన అనంతరం వినయ్‌కుమార్.. కావాలనే తండ్రిని నమ్మించి నాటకమాడుతున్నారని పోలీసులు, కుటుంబ సభ్యులు గుర్తించారు. చివరకు రైల్వే పోలీసుల సూచన మేరకు ఆదివారం మహబూబాబాద్‌కు చేరకున్న కుటుంబీకులు.. డీఎస్పీ కార్యాలయంతో పాటు వినయ్‌కుమార్ నివాసముండే వరంగల్‌లోని కేయూ పోలీసు స్టేషన్‌లో ఆయన అదృశ్యంపై ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

సర్పంచ్ భర్తపై కేసు

చెన్నారావుపేట : వ్యవసాయ భూమిలో స్తంభాన్ని విరగ్గొట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ ఆదివారం తెలిపారు. మండలంలోని గురిజాల సర్పంచ్ భర్త గొడిశాల సదానందం వ్యవసాయ భూమిలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని జీపీ ట్రాక్టర్‌తో శనివారం విరగ్గొట్టిస్తున్నాడు. దీనిపై గ్రామస్తులు.. విద్యుత్ ఏఈ సంపత్‌కు సమాచారం అందించగా ఆయన అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. అనంతరం సదానందంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐదుగురి ప్రాణాలు బలితీసుకున్న లారీ (ఫైల్)


పసరగొండ క్రాస్ వద్ద జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు (ఫైల్)


ఓగ్లాపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన ఆటో (ఫైల్)


డేంజర్ జోన్

- రక్తసిక్తమవుతున్న ఎన్‌హెచ్–163
- మితిమీరిన వేగంతో భారీ వాహనాలు
- కరువైన వేగ నియంత్రణ చర్యలు
- మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేవు

హనుమకొండ నుంచి ములుగు వెళ్లే హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారి–163 ప్రమాదాలకు నిలయంగా మారి రక్తసిక్తమవుతోంది. ముఖ్యంగా పత్తిపాక క్రాస్‌రోడ్ కటాక్షపూర్ వంతెన నుంచి మహ్మద్‌గౌస్‌పల్లి వరకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం డేంజర్ జోన్‌గా తయారైంది. ఈప్రాంతంలో ఇంకా రోడ్డు విస్తరణ జరగలేదు. అలాగే నిర్మాణాలు చేపట్టలేదు. ఈ రహదారిపై నిత్యం క్రషర్ వాహనాలు, ఇసుక టిప్పర్లు, మట్టి తరలించే భారీ వాహనాలు మితిమీరిన వేగంతో వెళ్తూ ఉంటాయి. రహదారిపై వేగ నియంత్ర సూచీలు, మూలమలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయడంలో ఎన్‌హెచ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఫలితంగా అమాయకుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

ఆత్మకూరు/పరకాల/దామెర


2019 అక్టోబర్ 4న మహ్మద్‌గౌస్‌పల్లి-కటాక్షపూర్ వద్ద ప్రమాదం(ఫైల్)

ఎన్‌హెచ్‌పై జరిగిన ప్రమాదాల్లో కొన్ని..

- 2019 ఫిబ్రవరి 2న ఓగ్లాపూర్‌లోని పవర్‌గ్రిడ్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. మార్చి 23న ఇదే ప్రాంతంలో కారును లారీ ఎదురుగా ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందారు.
- 2019 అక్టోబర్ 4వ తేదీన మహ్మద్‌గౌస్‌పల్లి-కటాక్షపూర్ మధ్య ఎదురుగా వస్తున్న అంబులెన్స్‌ను ఎస్‌ఆర్‌హెచ్‌ఎం ఉద్యోగి కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా నలుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.
- 2020 సెప్టెంబర్ 2న పసరగొండ క్రాస్ వద్ద కారును ఇసుక లారీ అతి వేగంగా ఢీకొనగా కారులో ఉన్న ఐదుగురు మృతి చెందారు. నవంబర్ 1న ఊరుగొండ సమీపంలో టిప్పర్ ఆటోను ఢీకొనగా మహిళ మృతి చెందింది.
- 2021 మార్చి 19న మిరపతోటలో కాయలు ఏరేందుకు కూలీలతో వెళ్తున్న ఆటోను నీరుకుళ్ల క్రాస్ వద్ద ఎదురుగా వచ్చిన తుఫాన్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో నలుగురు కూలీలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మరికొందరు తీవ్రగాయాలపాలయ్యారు.
- పత్తిపాక క్రాస్‌రోడ్ సమీపాన రోడ్డుపై ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆత్మకూరుకు చెందిన ఓ వ్యక్తి బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు.
- 2021 మే 30న ఓగ్లాపూర్‌లోని డిస్నీల్యాండ్ పాఠశాల వద్ద కూరగాయల ఆటోను ఇసుకలారీ ఎదురుగా ఢీకొనగా ఆటోలోని ఇద్దరు మహిళలు మృతి చెందారు.
- 2022 జనవరి 13న ఓగ్లాపూర్ సమీపంలో టిప్పర్ ఢీకొన్న ఘటనలో జాటోతు పుష్ప మృతి చెందారు.
- 2023 ఫిబ్రవరి 11న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనగా చిల్లా సంపత్, మోతే సంతోష్ మృత్యువాత పడ్డారు.
- 2023 మే 28న ఊరుగొండ వద్ద ట్రాక్టర్, లారీ ఢీకొన్న ఘటనలో పేరబోయిన చంద్రు అనే రైతు మృతిచెందాడు.
- 2023 జూన్ 4న ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్ వద్ద లారీ ఢీకొన్న ఘటనలో అబ్బాస్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. 5న ఊరుగొండ సమీపంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో గోరంట్ల కిరణ్ అనే యువకుడు మృతిచెందాడు.


కారులో చిక్కుకున్న మృతదేహం

హత్య కేసు విచారణ వేగవంతం చేయాలి

- జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు భద్రయ్య


మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భద్రయ్య

బచ్చన్నపేట : రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసును వేగవంతం చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య అన్నారు. ఈమేరకు ఆదివారం బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామానికి వెళ్లి మృతుడు రామకృష్ణయ్య చిత్రపటానికి పూల మాలలను వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా భద్రయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలు మితిమీరుతున్నాయన్నారు. దీనిపై ప్రశ్నించిన వారిని హత్య చేయిస్తున్నారని మండిపడ్డారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి భర్త అంజయ్య సుపారీ ఇచ్చి రామకృష్ణయ్యను హత్య చేయించారన్నారు. ఈ హత్య వెనుక ఉన్న సూత్రధారులు తెలియాలంటే ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ కేసు విషయంలో లీగల్‌గా తమ సహకారం అందజేస్తామని, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి యాసారపు కరుణాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శాడగొండ రమేశ్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగిటి నరేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు బక్క రవి పాల్గొన్నారు.

మచ్చాపూర్‌లో చోరీ

గీసుకొండ : మండలంలోని మచ్చాపురానికి చెందిన ఆంగోత్ సుమన్ పల్లార్‌గూడ రోడ్డులో ఇల్లు నిర్మిస్తుండగా శనివారం రాత్రి దొంగలు పడ్డారు. ఇంట్లోకి చొరబడి రూ.లక్షా 50వేల నగదు, రూ. 40 వేల విలువైన ఆభరణాలు, సెల్‌ఫోన్ అపహరించుకుపోయారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నారుకు నీరు పెట్టడానికి వెళ్లి..

- విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి
- శోకసంద్రంలో ఆయా కుటుంబాలు


రవీందర్‌రావు(ఫైల్)


సాంబయ్య (ఫైల్)

వర్ధన్నపేట/హసన్‌పర్తి : నారు మడికి నీరు పెట్టడానికి వెళ్లిన ఇద్దరు రైతులు.. విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెం, హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో జరిగింది. వర్ధన్నపేట మండలం కడారిగూడెం గ్రామానికి చెందిన శిరంశెట్టి రవీందర్‌రావు(59) తన కుమారుడు రాజ్‌కుమార్‌తో కలిసి ఆదివారం ఉదయం నారు మడికి నీరు పెట్టడానికి వ్యవసాయ బావి వద్ద వెళ్లారు. ఈ క్రమంలో మోటారు నడవకపోవడంతో విద్యుత్ సరఫరా కావడం లేదని గమనించిన రవీందర్‌రావు.. సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆపేందుకు హ్యాండిల్‌ను పట్టుకుని ఆఫ్ చేస్తుండగా విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మరోఘటనలో హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన కన్నబోయిన సాంబయ్య(35)కు ఏనుమాముల పీఎస్ పరిధిలోని మట్టెవాడ శివారులో రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. దీంతో పాటు మరో పదెకరాల భూమిని కౌలుకు తీసుకున్నాడు. ఈక్రమంలో నారుమడికి నీరు పెట్టడానికి బావి వద్దకు వెళ్లి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై ఆయా మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వర్ధన్నపేట, ఏనుమాముల మార్కెట్ ఎస్సైలు ప్రవీణ్‌కుమార్,ఎస్సై రాజన్‌బాబు తెలిపారు.

ఎమ్మెల్యే రమేశ్ పరామర్శ

ఈ ఘటనలపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్.. మృతదేహాలను సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేశ్, మాజీ చైర్మన్ అశోక్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జంగా కుమార్, మాజీ సర్పంచ్ రాజేందర్ యాదవ్, బీఆర్‌ఎస్ డివి జన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మనబడి -మన బాధ్యత నియోజకవర్గ కన్వీనర్ దోమ కుమార్, నాయకులు భాస్కర్, శ్రీనివాస్ ఉన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్.. కానిస్టేబుల్ అవతారం

- భూ సెటిల్‌మెంట్ చేసుకోవాలని బెదిరింపులు
- అనుమానంతో యజమానుల ఆరా.. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు..

హసన్‌పర్తి: కాకతీయ యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ఓ కాంట్రాక్ట్ లెక్చరర్.. టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ అవతారమెత్తాడు.భూమి సెటిల్‌మెంట్ చేసుకోవాలని యజమానులను బెదిరింపులు గురి చేశాడు. అయితే అనుమానం వచ్చిన సదరు భూయజమానులు ఆరా తీయగా, నకిలీ కానిస్టేబ ఎల్‌గా తేలింది.ఈ మేరకు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న ఎస్సై.. విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. హన్మకొండ మండలం గుండ్ల సింగారానికి చెందిన బాటోతు జైత్యా కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో కాంట్రాక్ట్ అధ్యాపకుడిగా కొనసాగుతున్నాడు. ఈ క్రమంలో ధర్మసాగర్ మండలం ఉనికిచర్లలో వ్యవసాయ భూమిని కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాడు. అనంతరం ధరణి వెబ్‌సైట్‌లో భూముల వివరాలు సెర్చ్ చేశాడు. ఇందులో 357 సర్వేనంబర్‌లో పట్టా ఒక్కరి పేరున ఉండగా క్షేత్రస్థాయిలో మరో ఇద్దరు సాగు చేసుకుంటున్నట్లు గుర్తించాడు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌గా అవతారం..

ఆ భూమిని సాగుచేసుకుంటున్న ఉనికిచర్లకు చెందిన సురేందర్, రవీందర్‌ను పిలిచి టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ జితేందర్‌గా పరిచయం చేసుకున్నాడు. 'పట్టాదారుల నుంచి ఫిర్యాదు అందింది.. భూమి సెటిల్‌మెంట్ చేసుకోండి..లేని పక్షంలో జైలుకు వెళ్తారని' బెదిరింపులకు గురి చేశాడు. భూమి తమదేనని, అన్ని పత్రాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనుమానంతో వారు టాస్క్‌ఫోర్స్‌లో జితేందర్‌రెడ్డి కానిస్టేబుల్ ఉన్నారా అనే విషయమై ఆరాతీశారు. చివరికి వచ్చిన వారు సూడో కానిస్టేబుల్‌గా నిర్ధారించుకుని పోలీసులను ఆశ్రయించారు. కాగా, కానిస్టేబుల్‌గా బెదిరించి వారి వద్ద నుంచి డబ్బు లాగడానికి యత్నించే క్రమంలో పట్టుబడినట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న డీసీఎం

- ఒకరి మృతి, మరొకరికి గాయాలు


సంతోష్ (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ క్రాస్‌రోడ్డు సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని డీసీఎం వ్యాన్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్, ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్దుంపురం గ్రామానికి చెందిన బెదిరోళ్ల సంతోష్ (24) గత ఐదేళ్లుగా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన కొనకంటి అనిల్‌కు చెందిన డీసీఎం వ్యాన్‌లో పాల ఉత్పత్తులను సరఫరా చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే హైదరాబాద్ నుంచి జెర్సీ పాల ఉత్పత్తులను హనుమకొండకు తరలించి తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. రఘునాథపల్లి మండలం కోడూరుకు చెందిన డ్రైవర్ యాకస్వామి డీసీఎంను అజాగ్రత్తగా నడుపుతూ ఘన్‌పూర్ శివారు తాటికొండ క్రాస్‌రోడ్డు వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందుభాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్ పక్కన కూర్చున్న సంతోష్ తీవ్రంగా గాయపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో క్యాబిన్‌లో ఉన్న వారిని బయటికి తీశారు. చికిత్స నిమిత్తం తరలిస్తుండగా సంతోష్ మార్గమధ్యలో మృతి చెందాడు. డ్రైవర్ యాకస్వామి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మచ్చాపూర్‌లో యువకుడు..


రాజశేఖర్(ఫైల్)

గీసుకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలోని మచ్చాపూర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నర్సంపేట వల్లభ్‌నగర్‌కు చెందిన ఎదరబోయిన రాజశేఖర్(27) వరంగల్‌లో సెంట్రింగ్ పనులు ముగించుకుని శనివారం రాత్రి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారి మచ్చాపూర్ బస్టాండ్ సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనం లైట్ వెలుతురుకు రోడ్డు కనిపించక సిమెంట్ స్తంభాన్ని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలైన రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మినర్సు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సట్ల రాజు తెలిపారు.

ఏసీపీ, సీఐని సస్పెండ్ చేయాలి


నిరసన తెలుపుతున్న మృతుడి కుమారుడు అశోక్

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యకు సహకరించిన జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ నాగబాబును వెంటనే సస్పెండ్ చేయాలని మృతుడి కుమారుడు నల్ల అశోక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిరసన తెలిపి పలువురిపై మరో మారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మా తండ్రిని హత్య చేయడానికి కొన్ని రోజులు ముందు సర్పంచ్ గట్టు మంజుల భర్త మల్లేశం గ్రామంలోని సీసీ కెమెరాలను పని చేయకుండా చేయించాడని తెలిపారు. అలాగే హత్యకు కొన్ని రోజుల ముందు చేసే ప్రతి కదలికను హంతకుడు గిరబోయిన అంజయ్యకు గట్టు మల్లేశం స మాచారం అందించాడని తెలిపారు. సుపారీ గ్యాంగ్‌కు ఆర్థికంగా సహకరించిన సూత్రధారులు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డిని, అలాగే ప్రోత్సహించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని కూడా విచారించాలన్నారు. మా తండ్రిని హత్య చేయడానికి ప్రతి విషయాన్ని హంతకుడు అంజయ్య ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు పోలీసులతో చర్చించాడని తెలిపారు. హత్యకు సహకరించిన ఏసీపీ, సీఐ లను సస్పెండ్ చేస్తూ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, సర్పంచ్ భర్త గట్టు మల్లేశంను విచారించాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయడానికి వెళ్లే సీఐ నాగబాబు పిటిషన్‌ను సతాయించి తీసుకున్నారని అన్నాడు. మాకు వరంగల్ సీపీ రంగనాథ్‌పై మాత్రమే నమ్మకం ఉందని, వారు స్వయంగా కేసును తెలుసుకొని టాస్క్‌ఫోర్స్ పోలీసులను రంగంలోకి దింపితేనే వాస్తవాలు బయటకు వస్తాయని మళ్లీ సీపీని కలుస్తామని తెలిపారు. ఈ కేసులో జరుగుతున్న ఆలస్యాన్ని, మరిన్ని కేసు పూర్వపరాలను తెలుపుతామన్నారు. వీరి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

హసన్‌పర్తి: ఆరోగ్యం బాగుపడడం లేదని మానసిక వేదనకు గురై ఓ వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని వంగపహాడ్‌లో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రుద్రారపు లింగయ్య(65) కూలి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. వైద్యం తీసుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడడం లేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లింగయ్య భార్య బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కేసముద్రం విలేజీలో మరొకరు..


కొమురయ్య మృతదేహం

కేసముద్రం: పని లభించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి.. ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం కేసముద్రం విలేజీలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం గ్రామానికి చెందిన కాసాని కొమురయ్య(60) కొంతకాలంగా మద్యానికి బానిసై ఎలాంటి పని చేయడం లేదు. ఈ క్రమంలో పూటగడవడం కష్టంగా మారడంతో పనికి వెళ్లాలని భార్య.. కొమురయ్యకు నిత్యం చెబుతుండేది. అయితే ఎక్కడా పని లభించకపోవడంతో మనస్తాపానికి గురైన కొమురయ్య.. ఉదయం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- రెండు కిడ్నీలు పాడై దిక్కుతోచని స్థితిలో మహిళ
- వైద్యం కోసం ఆర్థిక సాయం చేయాలని వేడుకోలు
- తల్లిని బతికించాలని వేడుకుంటున్న చిన్నారులు


దీన గాథ


దీనస్థితిలో ఎల్లమ్మ


తల్లిని బతికించాలని వేడుకుంటున్న పిల్లలు

చెన్నారావుపేట: జీవన పోరాటంలో ఓ పేద మహిళ రెండు కిడ్నీలు దెబ్బతిని బాగు చేయించుకోవడానికి ఎదురుచూస్తోంది. ఓ వైపు బతుకు పోరాటం.. మరో వైపు కుటుంబ పోషణ భారం.. ఏమి చేయలేని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట గ్రామంలో పొన్నాల రాములు– ఎల్లమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సరైన ఇల్లు లేక గుడిసెపై పరదా కప్పుకొని నివాసం ఉంటున్నారు. రోజు కూలి చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఈ క్రమంలో రెండు సంవత్సరాల క్రితం ఎల్లమ్మ అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోగా రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు. డాక్టర్ల సలహా మేరకు మందులు వాడినా ఫలితం లేకుండా పోయింది. వరంగల్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నట్లు బాధితురాలు కన్నీటి పర్యంతమవుతోంది. ఒకసారి డయాలసిస్‌కు మందులు కాకుండా రూ.10 వేలు ఖర్చు అవుతోందని, ఇప్పటి వరకు సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశామని చెప్పింది. కిడ్నీల మార్పిడికి దాతలు దొరికేతే సుమారు రూ.10 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారని ఆమె పేర్కొంది. వైద్యం చేయించుకోవడానికి దాతలు ఆర్థిక సాయం చేయాలని ఎల్లమ్మ వేడుకుంటోంది.

మా అమ్మను బతికించండి..

రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న మా అమ్మను బతికించాలని ఎల్లమ్మ కుమార్తెలు వెన్నెల, నవ్య, కుమారుడు మునేందర్ వేడుకుంటున్నారు. తమ దీనస్థితిని చూసి దాతలు ఆదుకోవాలని కోరుతున్నారు.

అకౌంట్ నంబర్ 38238660364 (ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : ఎస్‌బీఐఎన్ 00021352)
9640765301 (పొన్నాల శైలజ) నంబర్‌కు ఫోన్‌పే చేసి
తమ తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని వేడుకుంటున్నారు.